నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

సోమవారం | 07 జూలై 2025

పేజీలు 8





### రాయలసీమ ప్రాంతానికి ప్రాణాధారం

# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

- పోలవరం ప్రాజెక్టును త్వరలోనే కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంది
- గత ప్రభుత్వం తప్పిదాల వల్లే అలగనూరుకు శాపం
- చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు
- 21 రోజుల ముందుగానే దిగువకు సాగునీటి విడుదల
- గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు..
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి నీటిని విడుదల చేసిన మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి,ఎంపి డా.బైరెడ్డి శబరి,ఎమ్మెల్యే గిత్త జయసూర్య



కృష్ణమ్మకు చీర సారె అందిస్తున్న దృశ్యం

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- పోటెత్తుతున్న కృష్ణా,తుంగభద్ర నదులు
- పోతిరెడ్డిపాడు నుండి సీమకు ప్రారంభమైన నీటి మళ్లింపు
- తొలిరోజు 10 వేల క్యూసెక్కుల నీటి విడుదల
- నేడో,రేపో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం
- శ్రీశైలం గేట్లను పరిశీలించిన కన్నయ్యనాయుడు
- ఐదేళ్ల తర్వాత గేట్లు మార్చాల్సిందేనని తేల్చిన నాయుడు
- 10వ గేట్ లీకేజీతో సమస్య లేదు..

# నిండుకుండల్లా జలాశయాలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కృష్ణా, తుంగభద్ర నదులు వరదనీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువన కురిసిన వర్షాలతో ఈ ఏడాది ముందుగానే రెండు జలాశయాలు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. కర్నాటకలోని హోస్పేట తుంగభద్ర డ్యాం వద్ద దాదాపు గేట్లన్నీ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండగా, శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. తుంగభద్ర నదిపై సుంకేసుల వద్ద ఉన్న రిజర్వాయర్ నుండి శ్రీశైలం వైపు జలాలు పరుగులు తీస్తున్నాయి. మరోవైపు పోతిరెడ్డిపాడుహెడ్ రెగ్యులేటర్ గేట్లను ఆదివారం ఎత్తి రాయలసీమకు నీటిని తరలించడం ప్రారంభించారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలు శ్రీశైలం వద్ద పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. వరద నీరు పోటెత్తుతుండడంతో నేడు లేదా రేపు శ్రీశైలం గేట్లు కూడా ఎత్తే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వ సలహాదారుగా ఉన్న కన్నయ్యనాయుడు ఆదివారం శ్రీశైలం జలాశయాన్ని పరిశీలించారు. మరో ఐదేళ్లు గేట్లు మార్చాల్సిన అవసరం లేదని,

మిగతా 2లో



# బనగానపల్లెలో భక్తి శ్రద్ధలతో ముగిసిన మొహర్రం

- విషాద గీతాలు అలపిస్తూ రక్తం చిందించిన షియా ముస్లింలు
- మాతం ఊరేగింపులో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

**బనగానపల్లె మేజర్ న్యూస్:** కర్బలలో జరిగిన యుద్ధంలో వీరమరణం చెంది అశువులుబాసిన మహమ్మద్ ప్రవక్త మనుమలైన హసన్, హుస్సేన్ వారి కుటుంబీకుల మృతికి సంతాప సూచకంగా బనగానపల్లె పట్టంణంలో

మిగతా 6లో



మొహర్రం వేడుకల్లో పాల్గొన్న నవాబ్ వంశస్థులు

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

8లో



పూజల్లో పాల్గొన్న భక్తులు , పూజలందుకుంటున్న శ్రీ వెంకటేశ్వర స్వామి

### జిల్లా రిజిస్ట్రార్..

# కాసుల గలగల




నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

- ప్రతి పనికి ఒక రేటు
- డీల్ కుదిరితేనే దస్త్రాల కదలిక
- పేరుకుపోతున్న దస్త్రాలు
- కార్యాలయంలో చక్రం తిప్పుతున్న ఓ ఉద్యోగి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా కార్యాలయంలో కాసులు కురిపిస్తేనే దస్త్రాలు కదులుతున్నాయి.గత కొద్ది నెలల నుంచి దస్త్రాల కదలికకు డీల్ కుదరక కార్యాలయంలో దస్త్రాలు పేరుకుపోతున్నాయి. డీల్ కుదిరిన దస్త్రాల్లోనే కదలిక కనిపిస్తుంది. ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించిన పాలన సాగుతుంది. కార్యాలయంలోని ఓ చిరు ఉద్యోగి ఒకరు చక్రం తిప్పుతున్నారు. ఆ చిరు ఉద్యోగి కనికరిస్తేనే జిల్లా

మిగతా 6లో

### శ్రీశైలం డ్యాం గేట్ లీకేజ్ వలన

# ఎలాంటి ప్రమాదం లేదు

- పదో నెంబర్ గేట్ లీకేజీ 10 శాతం కన్నా తక్కువే
- మరో ఐదేళ్లలో డ్యామ్ గేటు మార్చాల్సిందే..లేకుంటే తుంగభద్ర పరిస్థితే
- ఆనకట్టకు,ఫ్లంజ్ పూల్ కు 60 మీటర్ల దూరం..ప్రమాదం ఏమీ లేదు
- శ్రీశైలం డ్యాం గేట్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి
- గేట్ల నిపుణులు కన్నయ్య నాయుడు

2లో



గేట్లను పరిశీలిస్తున్న దృశ్యం

# 10న మెగా పేరెంట్స్ సమావేశం

- ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలలు,జూనియర్ కళాశాలల్లో సమావేశాలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి
- తల్లి పేరుతో మొక్కను నాటించండి
- ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపండి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

మిగతా 6లో

సూర్య

సోమవారం | 07 జూలై 2025

# నిండుకుండల్లా జలాశయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత మార్చాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 10వ గేట్ లీకేజీ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని ఆయన తేల్చి చెప్పారు. ఫ్లంజ్ ఫూల్ దెబ్బతిన్న కారణంగా జలాశయానికి ఎలాంటి ప్రమాదం లేదని, ఇప్పటికిప్పుడు గేట్లకు రంగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన విలేకరులతో చెప్పారు.

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి రాయలసీమకు నీటిని విడుదల చేయడం ప్రారంభం కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తొలి రోజు 10వేల క్యూసెక్‌ల నీటిని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మళ్లించడం ప్రారంభించారు. 44వేల క్యూసెక్‌ల నీటిని విడుదల చేయగలిగిన సామర్థ్యం ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుండి రానున్న మూడు నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని రాయలసీమకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్ నుండి కూడా చివరి వరకు నీటిని మళ్లించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దగ్గర నీటిని విడుదల చేస్తున్న మంత్రి బీసీ, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య

జారీ చేసిన నేపథ్యంలో మరో వారం రోజుల తర్వాత అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీటిని మళ్లించే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయానికి నిరుడు కంటే 20 రోజుల ముందుగానే వరదనీటి ప్రవాహం పోటెత్తుతున్న నేపథ్యంలో రాయలసీమకు అవసరమైన జలాలను పోతిరెడ్డిపాడు నుండి మళ్లించుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నీటి నిర్వహణపై శ్రద్ధ చూపించడం ద్వారా రాయలసీమ రైతుల ఆకాంక్షలు నెరవేర్చామని చెప్పుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. కృష్ణా నదికి వరదనీటి ప్రవాహం కొంత కాలం మాత్రమే కొనసాగే అవకాశం ఉండడంతో పోతిరెడ్డిపాడు నుండి 44వేల క్యూసెక్‌ల నీటిని విడుదల చేసుకుంటేనే రాయలసీమకు అవసరమైన జలాలను తరలించుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం గుర్తించినట్లు కనిపిస్తోంది.

శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి డ్యాంలో 184.2774 టిఎంసిల నీటి నిల్వలుండగా, డ్యాంలో 215 టిఎంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయంలో కృష్ణా, తుంగభద్ర నదుల నుండి వరద నీరు చేరుతోంది. డ్యాంలోకి 1,76,434 క్యూసెక్‌ల నీరు చేరుతోండగా, జూరాల నుండి విద్యుత్ ఉత్పత్తి అనంతరం 29,296 క్యూసెక్‌లు, స్పిల్ వే ద్వారా 79,920 క్యూసెక్‌ల వరదనీరు వస్తోంది. ఇక, సుంకేసుల నుండి 67,218 క్యూసెక్‌ల వరద నీరు శ్రీశైలం చేరుతోంది. కుడి విద్యుత్ కేంద్రం నుండి 32,425 క్యూసెక్‌లు, ఎడమ విద్యుత్ కేంద్రం నుండి 35,215 క్యూసెక్‌ల నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగిస్తూ దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల వద్ద కూడా కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. డ్యాంలోకి 1, 13,000 క్యూసెక్‌ల వరద ప్రవాహం వచ్చి చేరుతోండగా, బీమా ఎత్తిపోతల పథకానికి 650 క్యూసెక్‌లు, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ, కుడి కాలువకు 550, 290 క్యూసెక్‌ల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ లింక్ చానల్‌కు 150, సమాంతరకాలువకు 750 క్యూసెక్‌లు విడుదల చేస్తున్నారు.

తుంగభద్ర నదికి వరద పోటెత్తుతున్నా కెసి కెనాల్‌కు నీటి విడుదల ఇంకా ప్రారంభించలేదు. ఇక్కడ 1.2 టిఎంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా, పెద్ద ఎత్తున వరదనీరు చేరుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా నదిలోకి విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లోకి 72వేల క్యూసెక్‌ల నీరు వచ్చి చేరుతోండగా, నదిలోకి 61,931 క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు. కెసి కెనాల్ గుండా కర్నూలుకు తాగునీటిని ఇస్తున్నారు. కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీశైలం డ్యాంకు జలకళ

**ఈనెల 10 లోపు ఏ సమయంలోనైనా డ్యామ్ గేట్ల ఎత్తివేత**

**జూరాల,సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,76,434 క్యూసెక్కుల నీరు**

**879.30 అడుగులకు చేరిన డ్యామ్ నీటిమట్టం**

**రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కృష్ణానది పరివాహక ప్రాంతమైన జూరాల, సుంకేసుల ప్రాజెక్టు నుండి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది.ఎగువన కురిసిన వర్షాల కారణంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది.దీంతో శ్రీశైలం జలాశయానికి గతంలో ఎన్నడు లేని విధంగా మే నెలలోనే నీటి చేరిక ప్రారంభమైంది. ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా డ్యామ్ నీటిమట్టం వేగంగా పెరుగుతూ పూర్తిస్థాయికి చేరువులో ఉంది.దీంతో శ్రీశైలం వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు..నీటి నిల్వ సామర్థ్యం215.8070 టీఎంసీలు.కాగా ఆదివారంసాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 879.30 అడుగులకు చేరుకుంది.ఇదే సమయానికి జూరాల,సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,76,434 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు ఉండటంతో రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. ఆంధ్ర పరిధిలోని కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల వ్యవధిలో 14.461 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.అలాగే తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 17.109 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేశారు. జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా కుడిగట్టు జల విద్యుత్ కేంద్రానికి 26,066 క్యూసెక్కులు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రానికి 34,493 క్యూసెక్కుల వీటిని విడుదల చేశారు. నీటి ఆవిరి రూపంలో 188 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. ప్రస్తుతం జలాశయంలో 184.2774 క్యూసెక్కుల నీరు నిల్వగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67,740 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జున సాగర్ కు విడుదల చేశారు. వస్తున్న వరద కారణంగా ఈనెల 10వ తేదీలోపు ఏ సమయంలోనైనా డ్యామ్ రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఇప్పటికే అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.డ్యాం ఇంజినీరింగ్ అధికారులందరూ అందుబాటులో ఉండాలని,ఎవరికి సెలవు ఇవ్వద్దని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా డ్యామ్ గేట్ల స్విచ్ ఆన్ చేసి నాగార్జునసాగర్కు నీటిని విడుదల చేయనున్నారు.

## శ్రీశైలం డ్యాం గేట్ లీకేజ్ వలన ఎలాంటి ప్రమాదం లేదు



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం డ్యాం10నెంబర్ గేట్ లీకేజీ వల్ల ప్రస్తుతం డ్యాంకు ఎలాంటి ప్రమాదం లేదని గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు అన్నారు. ఆదివారం ఆయన శ్రీశైలం డ్యాం గేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్ర మూర్తి ఈఈ వేణు గోపాల్ రెడ్డి,సంబంధిత ఇంజనీర్లతో కలిసి రేడియల్ క్రస్ట్ గేట్లను పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేటు నుంచి 10 శాతం కంటే తక్కువ లీకేజీ ఉందన్నారు. దానివల్ల ఎలాంటి ప్రమాదం లేదన్నా రు. ఇప్పటికే గేటు లైపు 40 ఏళ్లు పూర్తయిందని, మరో ఐదేళ్లకైనా గేటు మార్చుకుంటే తుంగభద్ర పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. 2010 తరువాత పెయింటింగ్ పనులు చేయలేదని, క్రమం తప్పకుండా గేట్లకు పెయిం టింగ్ పనులు చేస్తూ చుట్టూ తుప్పు పట్టకుండా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకుంటూ ఉంటే 60,70 ఏళ్లు డ్యామ్ గేట్లకు లైఫ్ ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆనకట్టపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.2009 వరదల సమయంలో నీటి విడుదల ద్వారా డ్యాం ముందుభాగాన ఏర్పడిన ఫ్లంజ్ పూల్ కు ఆనకట్ట పునాదులకు 60 మీటర్ల దూరం ఉందన్నారు.తద్వారా డ్యాంకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు.

## రాయలసీమ ప్రాంతానికి ప్రాణాధారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాయలసీమ ప్రాంతం రైతాంగానికి త్రాగునీరు, సాగునీటికి ప్రాణాధారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ అని ఇక్కడి నుంచి దిగువకు నీరు విడుదల చేయడం రాయలసీమ ప్రాంతం రైతులకు శుభపరిణామమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యలు అన్నారు. ఆదివారం మండలంలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి దిగువకు సాగునీరు, త్రాగునీరు విడుదల చేసే కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముందుగా హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బటన్ నొక్కి దిగువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం దిగువ ప్రాంతానికి పరుగులు పెడుతున్న కృష్ణమ్మకు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, గ్రామ సర్పంచు పల్లె నిర్మలమ్మలు చీర సారె వాయనం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్యలు మాట్లాడుతూ ఎగువన కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో జులై మాసంలోనే ఎన్నడూ లేని విధంగా 21 రోజులు ముందుగానే దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేసి



కృష్ణమ్మకు పూజలు చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

తరువాత నీటి విడుదల పెంపునకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇక్కడి నుంచి వెలుగోడు రిజర్వాయర్‌కు, అవుకు రిజర్వాయర్‌కు, గోరుకల్లు రిజర్వాయర్‌కు సాగునీటి అందిస్తామని తెలిపారు. ఏది ఏమైనా పోలవరం ప్రాజెక్ట్‌ను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని తెలిపారు. అదే విధంగా బాణకచెర్ల ప్రాజెక్ట్‌ను కూటమి ప్రభుత్వం చేపట్టి రాయలసీమ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు. బాణకచెర్ల ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణా రాష్ట్రానికి ఏ నష్టం లేదని కేవలం సముద్రంలో కలిసే వృధా నీటినే బాణకచెర్ల ప్రాజెక్ట్‌కు తరలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్లే అలగనూరు ప్రాజెక్ట్ ఈనాడు సాగునీరు అందించడం సాధ్యం కాకుండా రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. గత



మాట్లాడుతున్న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య

వైసీపీ ప్రభుత్వం అలగనూరు ప్రాజెక్ట్ పనులు చేపట్టి ఉంటే కేవలం రూ.25 నుంచి రూ.30 కోట్లలోపే అయిపోయేదని ఇప్పుడు రూ.100 కోట్లకు పైనే ఖర్చు అవుతుందని ఎస్టిమేషన్ వేయడం జరిగిందన్నారు. ఏది ఏమైనా రైతు సంక్షేమమే తమ ప్రభుత్వం ధ్యేయమని అలగనూరు ప్రాజెక్ట్ విషయంను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు పూర్తి అయ్యేలా చూస్తామని అన్నారు. రాయలసీమలోని అన్ని ప్రాజెక్ట్‌లకు నందికొట్కూరు నియోజకవర్గం నుంచి సాగునీరు వెళ్తుందని అన్నారు. బాణకచెర్ల ప్రాజెక్ట్ పూర్తి అయితే రాయలసీమ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుంద ని వారు అన్నారు. హంద్రీనివా సుజల శ్రవంతి కాలువ మరమ్మత్తులకు ముఖ్యమంత్రి రూ.2 వేల కోట్ల నిధులు మంజూరు చేసి ఆ ప్రాంతం చివరి ఆయకట్టు వరకు నీరు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇది రైతాంగం అంతా గుర్తుంచుకోవాలని అన్నారు. మన ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కూటమి ప్రభు త్వం ధ్యేయమని అన్నారు. అన్ని వేళలా రైతులకు అండ గా ఉండే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్, జల వనరుల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ నాగేంద్ర కుమార్, డిఈలు పాండురంగా రెడ్డి, రఘురామి రెడ్డి, ఏఈలు విష్ణువర్ధన్ రెడ్డి, తిమ్మారెడ్డి, శంకరయ్య, ఎంపీడీఓ గోపీకృష్ణ, తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, రూరల్ సిఐ సుబ్రమణ్యం, ఎస్సై లక్ష్మీనారాయణ, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ దేవల్లి మురళీ, సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మెన్ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచు రవికాంత్, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి,టీడీపీ నాయకులు పల్లె శివానందరెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, అడ్డాకుల ప్రసాద్, రాముడు, ముర్తుజావలి, గోవిందు, హుస్సేనయ్య, శ్రీనివాస్ గౌడు, రఘురామి రెడ్డి, మురళీ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జోనల్ మెంబర్ నాగేశ్వర్ రావు, బిఎస్ఎన్ఎల్ సలహామండలి మెంబర్ రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నవెంకటస్వామి, అధికారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# భక్తీ శ్రద్ధలతో తొలిఏకాదశి వేడుకలు

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్‌ః**

మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆదివారం తొలిఏకాదశి (ఆషాడ శుద్ధ ఏకాదశి) వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే యువకులు, మహిళలు, పెద్ద ఎత్తన వైష్ణవ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అందులో బాగంగా శ్రీ చింతలాముని, నల్లారెడ్డి దేవాలయం లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకు పూజ, మహామంగళహారతి నిర్వహించారు. తీర్థప్ర సాదాలు భక్తులకు అందజేవారు. అనంతరం సాయంత్రం భజనకార్యక్రమం నిర్వహించా రు.అలాగే మండలంలోనిహెచ్ కైరవాడి,గాజులదిన్నె,కులుమాల, అలువాల, పుట్టపాశం, వేముగోడు, గంజహల్లి, బైలుప్పల, అగ్రహారం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు తదితర గ్రామాల్లో కూడా భక్తి శ్రద్దలతో తొలిఏకాదశి వేడుకుల జరుపుకున్నారు.

# ట్రాక్టర్ యూనియన్ కమిటీ సభ్యుల ఎకగ్రీవ ఎన్నిక


నాయకులుగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్‌ః** గోనెగండ్ల ట్రాక్టర్ యూనియన్ కమిటీ సభ్యుల ఎన్నిక ఆదివారం ఎకగ్రీవం జరిగింది. ట్రాక్టర్ యూనియన్ నాయకులు సమావేశమై కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ప్రెసిడెంట్ గా గొల్లశివన్న, వైస్ ప్రెసిడెంట్ గా అమాలి వెంకటేష్, కార్యదర్శి గా రహంతుల్లా, సహాయకార్యదర్శి గా గోవిందు, కోశాధికారిగా మస్తాన్ ఎన్నికైనయ్యారు. వారు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి.. ఆళ్లగడ్డ డీఎస్పీ



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా, చిన్నపిల్లలు గర్భిణీ స్త్రీల కోసం రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ అధ్య క్షులు మహమ్మద్ హుస్సేన్, ప్రజ్ఞా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి నంద్యాల బ్లేడు సెంటర్ మేనేజర్ బ్లడ్ అచ్చు,ఉపాధ్యక్షుడు చంటి, సెక్రెటరీ శివ, ట్రెజరీ హరీశ్ ,సుబ్బారెడ్డి దూదేకుల బాబు సభ్యులు ఇమ్రాన్, నజీర్ బబ్లూ పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** గురుకుల పాఠశాల విద్యార్థులకు పూర్వ వైద్య విద్యార్థులు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు అనుమతితో పూర్వ విద్యార్థులు డాక్టర్ జనార్ధన్ రెడ్డి ఆద్వర్యంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ మహేష్‌రెడ్డి, ఇఎన్‌టీ డాక్టర్, డాక్టర్ లింగేశ్వరరావు, డాక్టర్ చిన్నన్న, డాక్టర్ సర్వేశ్వర్ గౌడ్, ల్యాబ్ సూపర్‌వైజర్లు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. వైద్య పరీక్షలు నిర్వర్తించిన వైద్య బృందానికి ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు 10న జరిగే సంయమ, 12లో ప్రతి పూర్వ విద్యార్థి పాల్గొనాలని ఆకర్శ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గొట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు


మృతి చెందిన రాముడు(24), భారతి(20) (ఫైల్‌ఫోటోలు)

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌ః** మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(24), భారతి(20) అనే వారు ప్రకాశం జిల్లా, కోమరోలు మండలం, అక్కపల్లెలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన కంబగిరిరాముడు(24) గ్రామంలో జీవాలు మేపుకుంటూ జీవనం సాగించేవాడని, అదేవిధంగా భారతి(20) కూలి పనులకు వెళ్ళేదని, అయితే భారతికి మండల పరిధిలోని అలేబాద్‌తాండ గ్రామానికి చెందిన శేఖర్‌తో మూడు సంవత్సరాల క్రితమే వివాహం జరిగిం దని, అయితే కులం, గోత్రాల విషయంలో పెద్దలు చెప్పిన వివరాల మేరకు వారు ఇరువురు అన్న చెల్లెల్లు అవుతారని పంచాయితీ పెద్దలు చెప్పడం జరిగిందని, కానీ వారు పెద్దల మాట లు వినకపోగా, పెద్దలు వారి వివాహానికి అంగీకరించరనీ ప్రకాశం జిల్లా, కోమరోలు మండ లం, అక్కపల్లెలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రకాశం జిల్లా పోలీసులు తెలిపారు. అయితే భారతికి రెండు సంవత్సరాల క్రితమే వివాహం కాగా, పలు కారణాలతో భర్తతో విభేదాలు ఏర్పడి పుట్టింట్లోనే నివాసం ఉంటోంది. అదే సమయంలో గ్రామంలో ఉండే రాముడితో ఆమెకు పరిచయం ఏర్పడి, పరిచయం కాస్తా వివాహేతర సం బంధంగా మారడంతో, కుటుంబ సభ్యులకు విషయం తెలిసి, ఇద్దరి మద్య కొనసాగుతున్న ఈ నైతిక సంబందాన్ని పెద్దలు గమనించి వారిని మందలిండంతో, ఇద్దరూ మానసికంగా కృంగిపో యి, మిత్రులు, బంధువులు ఎంత చెప్పినా వినకుండా ఇలా ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

# పొగాకు రైతులను ఆదుకోవాలి

**– మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు రైతు సంఘం వినతి**


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లాలోని పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని అలాగే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజశేఖర్ రాష్ట్ర న్యాయ, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ త్వరలోనే జరుగబోయే రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడులు మాట్లాడుతూ గతంలో రెండు నెలల నుంచి నంద్యాల జిల్లాలో పొగాకు రైతాంగం ఆందోళన చేస్తున్న సమయంలో కలెక్టర్ సహకారంతో జిల్లా వ్యవసాయ అధికారి సమక్ష్యంలో పొగాకు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు వచ్చి జూన్ నెల చివరిలోపు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కొనుగోలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇతర జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. నంద్యాల జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నంద్యాల జిల్లా రైతాంగానికి న్యాయం జరిగేలా చూస్తామని అలాగే మామిడి పంట వేసి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సురేష్, సిపిఎం నాయకులు నరసింహ, పొగాకు రైతులు వెంకటేశ్వర్ గౌడు, నారాయణ, శ్రీరాములు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ఘనంగా ఏకలవ్యుని జయంతి వేడుకలు


ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని సాయిబాబా వీధిలో గిరిజన సంఘం జాతీయ నాయకులు డా. గంగన్న ఆధ్వర్యంలో ఎరుకుల జాతి ఆరాధ్యదైవం ఏకలవ్యుడు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ నాయకులు, జిల్లా అధ్యక్షుడు డా.గంగన్న ఆధ్వర్యంలో ఏకలవ్యునికి చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. గంగన్న మాట్లాడుతూ ఏకలవ్యుడు గొప్ప ప్రతిభావంతుడు, విలువిద్యలో ఆరితేరిన వాడు, మహాభారతంలో ముఖ్య పాత్ర పోషించిన వాడు. గురువు లేని విద్యని అభ్యసించి ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప విలువిద్య కారుడన్నారు. గురువు అడిగిన వెంటనే బ్రొటన వేలును గురుదక్షిణగా,సమర్పించిన గొప్ప త్యాగమూర్తి అన్నారు.ఈ కార్యక్రమంలో తాలుకా అధ్యక్ష, కార్యదర్శి బైరి బాలరాజు, రమేష్, బైరి గురప్ప,చౌట వెంకటేష్, రమణ, నరసింహులు, ప్రసాద్, నందింపల్లె క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి

**– ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు**


ఏలకవ్యుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఏకలవ్యుడు మొక్కవోని దీక్షతో అత్యంత ప్రతిభను సంపాధించారని, భవిషత్ ఉన్నతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు ఏకలవ్యున్ని ఆదర్శంగా తీసుకోవాలని డా. నిరంజన్, పాపరాయుడు, ధనుంజయుడు, కుప్పస్వామి, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకొని ఏకలవ్యనగర్‌లో ఎరుకలంతా ఐక్యమై వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యున్ని చిత్రపటానికి పూలమాలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులేని విద్య గుడ్డి విద్య అంటారు కాని ఏకలవ్యుడి తన గురు ప్రతిమను తయారు చేసుకొని ఏకాగ్రతతో విలువిద్యలో సాటిలేని ప్రతిభ కనపరిచిన మహోన్నత వ్యక్తి ఏకలవ్యుడని అన్నారు. ఏకలవ్యున్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుంటే అనుకున్నది సాధించవచ్చన్నారు. యువత, విద్యార్థులు ఏకలవ్యుని ఆదర్శంగా తీసుకోని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న నరసింహులు, సుంకన్న, ప్రసాద్, భాస్కర్, రాజు, ఓబులేసు, కుర్మయ్య, సులోచణమ్మ,అనురాధ, హుసేనమ్మ, సునీత, అరుణ, శారద, కమిటి సభ్యులు అందరు పాల్గొని పండుగల ఏకలవ్యుని జయంతి వేడుకలు నిర్వహించారు.

# బిసి కులాల స్మశాన వాటిక సమస్యకు సహకరిస్తాం

**★మాజీ ఎంపి బుట్టారేణుక**


బుట్టా దంపతులను కలిసిన స్మశానవాటిక పెద్దలు

**ఎమ్మిగనూరు , మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు పట్టణ శివారులో ఉన్న బిసి స్మశాన వాటిక కబ్జాకొరల నుండి విముక్తి కలింగించేందుకు తమ వంతుగా సమకారం ఉంటుందని కర్నూలు మాజీ ఎంపి , ఎమ్మిగనూరు వైకాపా సమన్వయకర్త బుట్టారేణుక 22 బిసి కులాల నాయకులకు బరోసాని ఇచ్చారు. ఆదివారం ఎమ్మి గనూరు పార్టీ కార్యలయంలో 22 బిసి కులాల నాయకలు బుట్టా దంపతులను కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బిసి స్మశాన వాటిక సమస్యకు తీర్మాణం చేయించడం పట్ల బుట్టా దంపతులను వారు ఘనంగా సన్మానించారు. అధికార పక్షం కూడా సహకారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో 22 బిసి కులాల నాయకులు, స్మశాన వాటిక సంఘం పెద్దలు పాల్గొన్నారు.

**సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్.. :** సమాజంలో అనగారిన వార్గల సంక్షేమాన్ని కోరిన వ్యక్తి భారత ఉపప్రదాని దివంగత బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మిగనూరు వైకాపా ఇంచార్జ్ బుట్టారేణుక పేర్కొన్నారు. ఆయన 39వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఆమె మాట్లాడుతూ దళితుల ఆవాజోతిగా ఆయన చేసిన కృషి అజరామం అని కొనియాడారు.

**బూత్‌కమిటీలను బలోపేతం చెయ్యాలి.. :** రానున్న స్థానికం, సార్వత్రిక ఎన్నికల నాటికి కిందస్థాయిలో రాజకీయాలకు అనుసందానంగా ఉన్న పోలీంగ్ బూత్ కమిటీలను బలోపేతం చెయ్యాలని జిల్లా బూత్‌కమిటి ప్రదాన కార్య దర్శి కరె రమేష్‌కు వైకాపా ఇంచార్జ్ బుట్టారేణుక సూచించారు. తమరు నాపై పెట్టిన నమ్మకానికి వైకాపాను బూత్ లెవల్‌గా అద్యయనం చేసి వైకాపాకు ఓట్లు శాతం పెంచేం దుకు ముందుటా అని నాగలదిన్నె కరె రమేష్ మాటిచ్చారు. ఆయన పార్టీ కార్యలయంలో బుట్టా దంపతులకు ఆదివారం శాలువ కప్పి, పుష్పగచ్చం అందించి కృతజతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైకాపా నాయకులు పాల్గొన్నారు.


బుట్టాదంపతులకు సన్మానిస్తున్న కరె రమేష్

# గోనెగండ్ల మండలంలో ఘనంగ మెహర్రం వేడుకలు



మెహర్రం వేడుకల్లో పూజలు అందుకుంటున్న పీర్లు

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్‌:** త్యాగానికిప్రతీకగాకులమతాలకు అతీతంగా, హిందు ముస్లింలు జరుపుకునే మెహరం వేడుకలు ఆదివారం మండల కేంద్రమైన గోనెగండ్ల, ఐరన్బండ గ్రామాలలో ఘనంగా జరిగాయి. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు గాను విచిత్రవేశదారణలు వేసి ప్రజలకు ఆకట్టుకున్నారు. సాయంత్రం పీర్ల చావిడిల దగ్గర పీర్లస్వాముల వారి సవారి నిర్వహించారు. భక్తులు అడిగిన భవిష్యత్ ప్రశ్నలకు సమాదానం ఇచ్చారు. ఈ ఎడాది వర్షాలు ఎలా కురుస్తాయి. పంటలు ఎలా పండుతాయని గ్రామప్రజలు పీర్ల స్వాములను అడిగారు. ఈ సందర్భం గా ముజావర్లు దరగల మాబు, ముల్లా రహీమాన్ మాట్లాడుతూ మెహర్రం పండుగను గ్రామీణ ప్రాంతాల్లో పీర్ల పండుగా పిలుస్తారు. పీర్ అనగా అరబ్లో గురలవు,జ్ఞానం, తేజముఅని అర్థం. మహమ్మద్ ప్రవక్త మనువళ్లు హసన్, హుసేన్లు దైవాజ్ఞకు లోబడి అప్పటి ఖలీఫాతో యుద్ధం చేసి మృతి చెందారని వారి జ్ఞాపకార్థం వారి ప్రాణత్యాగాలకు గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు. ముస్లీంలకు మెహరం నెల తోఅరబ్‌సంవత్సరం ప్రారంభం అవు తుందని తెలిపారు. సాయ ంత్రం పొద్దుపోయాయ పీర్లను గ్రామ శివార్ల దగ్గర ఉన్న పురాతన బావిదగ్గరకు తీసుకువెళ్లారు. రాత్రి అక్కడి నుంచి అరబా బాషాలో శోకిస్తు పాటలను పాడుతు చావిడిల దగ్గరకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గటిబందోబస్తు నిర్వహించినట్లు సీఐ విజయ్ భాస్కర్ తెలిపారు.



విచిత్రవేశాలు వేసిన భక్తులు

# అంగరంగ వైభవంగా లాల్ స్వామి పీరు ఊరేగింపు

**-మతసామరస్యాన్ని చాటిన మొహర్రం వేడుకలు**
**-రాష్ట్రం నలుమూలల నుండి లాల్ స్వామి ఊరేగింపులో వేలాదిగా తరలివచ్చిన హిందూ ముస్లిం సోదరులు**
**-ఎలాంటి ఘర్షణలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు**

**చాగలమర్రి ,మేజర్‌న్యూస్ :** చాగలమర్రిలో మొహరం పండుగ సందర్భంగా వెలసిన లాల్‌స్వామి పీరు ఊరేగింపు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఊరేగింపులో రాష్ట్రం నలుమూలల నుండి హిందూ ముస్లిం సోద రులు వేలాది సంఖ్యలో పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. స్థాని క చిన్నమకానం మొహ రం పండుగ సందర్భం గా వెలసిన ప్రధాన పీరు లాల్ స్వామి స్వామిని ముందుగా రెడ్డి ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించిన అనంత రం ఖతీబులు స్వామి ని ఎత్తుకొని చాగలమ రి ప్రధాన రహదారుల గుండా భక్తులు గంధం చెల్లుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. స్వామికి భక్తులు అడుగడుగునా చొంగ రొట్టెలతో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఊరేగింపులో కమలాపురం స్వామిభక్తులు తాగునీటి సౌకర్యం కల్పించారు. లాల్ స్వామి కమిటీ అధ్యక్షులు చక్రం అధినేతముల్లాషబ్బీర్ అహ్మద్,ఉపాధ్యక్షులుముల్లా ఇబ్రహీం, ముల్లా రఫీ, ముల్లా ఖాదర్ బాషా, ముల్లా షఫీ, ముల్లా షంషీర్, పర్యవేక్షణలో సాగింది ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్పి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ రూరల్ సిఐ మురళీధర్ రెడ్డి ఎస్సై సురేష్ గడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కడప కర్నూలు నంద్యాల జిల్లా తో పాటు ఇతర జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడులు ప్రత్యేక పాతిహాల్ చేశారు.



చాగలమర్రిలో లాల్ స్వామి ఊరేగింపు దృశ్యం

# రాజవర్ధన్‌రెడ్డి వల్లే గంగమ్మ చెరువును కాపాడుకున్నాం

**ః– కెడిసిసి చైర్మన్ డి విష్ణువర్ధన్‌రెడ్డి**

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ ః** కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామం నందు గంగమ్మ చెరువును స్వర్గీయ రాజవర్ధన్ రెడ్డి వల్లే కాపాడుకున్నామని కెడిసిసి చైర్మన్ డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు అన్నారు. ఆదివారం తాండ్రపాడు గ్రామంలోని గంగమ్మ చెరువును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.150కోట్ల విలువ చేసే గంగమ్మ చెరువు ఆక్రమణ అంశంపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ హైకోర్టు స్టే విధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాడు తాండ్రపాడు గంగమ్మ చెరువును వైసిపి ప్రభుత్వంలో పెద్దల అండదండలతో కబ్జాకోరులు ఆక్రమించుకుని పూడ్చివేసి దాదాపు 12ఎకరాలను దర్జాగా చెరువును పూడ్చి వేశారన్నారు. దాని చుట్టూ ఇనుప కంచె వేసి కబ్జా చేసుకున్నారని తెలిపారు. ప్రజల దాహార్తిని, ఆ చుట్టుపక్కల గ్రామాల రైతుల సాగునీటి అవసరాలను తీరుస్తున్న గంగమ్మ చెరువును కబ్జాకోరల నుంచి విడిపించాలని ఆనాటి యువ నాయకులు, మాజీ ఎంపిపి రాజవర్ధన్‌రెడ్డి చెన్నై మహానగరం, దక్షిణ భారతదేశం గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అక్కడ ప్రజల తాగునీటి అవసరాలు, ఆ ప్రాంతం యొక్క రైతులకు సాగునీటికి సంబంధించిన విషయాలను గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. చెరువును కబ్జా చేస్తే భవిష్యత్తు తరాలకు తాగడానికి కనీసం చుక్కనీరు దొరకదని ఈ ప్రాంతం యొక్క బాగోగులు ఆలోచించిన మేధావి మాజీ ఎంపిపి రాజవర్ధన్ రెడ్డి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ హైకోర్టులో కేసు వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కేసు జరుగుతున్న సందర్భంలోనే ప్రజానాయకుడు రాజవర్ధన్‌రెడ్డి అకాల మరణం చెందారని ఈ విషయాన్ని కోడుమూరు నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరు జీర్ణించుకోలేని సంఘటన అన్నారు. ఇప్పటికీ ప్రజల మదిలో మెలుగుతున్న మహానాయకుడు రాజవర్ధన్ రెడ్డి కొనియాడారు. చిన్న వయసులోనే తండ్రిని మించిన తనయుడుగా రాజవర్ధన్‌రెడ్డి మనసును గెలిచాడని, శత్రువులు కూడా ఆయనను పొగిడే పరిస్థితి తెచ్చుకున్నాడన్నారు. ప్రజల అభిమతమే తన మతంగా భావించి రాజవర్ధన్ రెడ్డి పోరాటం చేశారని చెప్పారు. ఇంకా పూర్తి స్థాయిలో చెరువుని సంరక్షించి చుట్టుపక్కల ప్రజలకు సాగు,తాగునీరు అందించే వరకు కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు బుర్ర వెంకటేష్ నాయుడు, హెచ్‌డిఎస్ మెంబర్ కొంతలపాడు రామాంజనేయులు, తాండ్రపాడు గ్రామ సర్పంచ్ జయన్న, ఎంపిటిసి మద్దిలేటి, యేసురాజు, మాజీ జిల్లా అధ్యక్షులు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెడిసిసి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :**

జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్‌లలో పోలీసులు రౌడీ షీటర్లు, నేర చ రిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. రౌడీ షీటర్లు, నేర చ రిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసులు సూచించారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. నిరంతరం మీపై నిఘా ఉంటుందని తెలిపారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఈనెల 9న శ్రీశైలంలో అంకాళమ్మ అమ్మవారికి బోనం సమర్పణ



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఈ నెల 9న ఆషాఢమాస మూలా నక్షత్రం సందర్భంగా లోక కల్యాణం కోసం శ్రీశైల మహాక్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికి దేవస్థానం తరుపున బోనం సమర్పించనున్నారు.ఉదయం 9.30 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు.సకాలంలోతగినంతవర్షాలుకురిసి పంటలు బాగాపండి రాష్ట్రం,దేశం సుభిక్షంగా ఉండాలని, అతివృష్టి,అనావృష్టి నివారించబడాలని,అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి నిరోధిం చబడాలని, రోగకారక పరిస్థితులు రాకుండా ఉండాలని, జనులందరికి ఆయురారోగ్యాలు చేకూరాని,అందరికీ సుఖ సంతోషాలు కలగాలని బోనం సమర్పించడం జరుగుతోంది. భక్తులందరూ ఈ కార్యక్రమములో పాల్గొని శ్రీస్వామిఅమ్మవార్ల కృపాకటాక్షాలు పొందాలని దేవస్థాన ఈవో యం.శ్రీనివాసరావు కోరారు.

# ముగిసిన మొహర్రం వేడుకలు



**గడివేముల మేజర్ న్యూస్ :** గడివేములమండలంలోని గడివేముల, గని, మంచాలకట్ట,పెసర వాయి, కరి మద్దల గ్రామాలలో పది రోజులపాటు మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పది రోజులపాటు పీర్ల చావిడి వద్ద పీర్లను కులమతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజైనాశనివారం నాడు మేళ తాళాలతో డప్పు చప్పుల మధ్య ఊరేగించి సాయంత్రం వాగు వద్దకు తీసుకెళ్లి శాంతింప చేశారు. గ్రామాలలో వివిధ వేషా దారుణాలో ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీ ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పది రోజుల నుండి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. శనివారంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్సై నాగార్జున రెడ్డి గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు

**– జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వ ర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 93,995 టన్నుల వివిధ రకాల ఎరువులను ప్రైవేట్ డీలర్లు మరియు మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. యూరియా 31,059 టన్నులు, డిఏపి 71,150 టన్నులు, పొటాష్ 6380 టన్నులు, సూపర్ 2775 టన్నలు మరియు కాంప్లెక్స్ ఎరువులు 46,630 టన్నులు ఉన్నాయని తెలిపారు. ఇవి ఖర్చు కాగా 64150 టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు 39500 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ముఖ్యంగా మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపారు. ఈ పంటకు రైతులు ఎక్కువగా ఎరువులు ఉప యోగిస్తున్నారని అన్నారు. అలాగే ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడం వల్ల కాలువ లకు నీరు త్వరగా చేరే సూచనలు ఉన్నందున ఎరువులను అధిక సంఖ్యలో ముందస్తుగా కొనుగోలు చేస్తున్నారని అన్నారు. అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని జిల్లాలో అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## గురుకుల పాఠశాల విద్యార్థి మృతి బాధాకరం

**-తల్లిదండ్రులను వదలి ఉండలేకే ఆత్మహత్య-మృతదేహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బీవీ, సబ్ కలెక్టర్**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు నియోజకవర్గం బనవాసి గురుకల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రిషితా ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం రాత్రి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రిషితా (16) బాత్రూంలో చున్నీతో ఉరి వేసుకొని మృతి చెందింది. విద్యార్థిని తిరుపతి జిల్లాలోని చింతవరం గ్రామానికి చెందిన విద్యార్థినిగా గుర్తించారు. బాలికకు తల్లిదండ్రుల ను వదిలి ఇక్కడ చదువుకోవడం ఇష్టం లేకనే ఉరి వేసుకున్నట్టు విద్యార్థుల స్నేహితులు తెలిపారు.మృత దేహాన్ని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లుపరిశీలించారు.ఈసందర్భంగాఎమ్మెల్యే బీవీమాట్లాడుతూ రిషితా తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం వరకు ఇక్కడికి వచ్చి సముదాయించి బాగా చదువుకోవాలని మనకు సీటు వచ్చిందని ఒప్పించి వెళ్లిన తర్వాత విద్యార్థిని భావోద్వేగం గురై ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తు ఉన్నటువంటి యువత ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం బాధాకరంగా ఉందన్నారు. విద్యార్థి విద్యార్థిలు తల్లిదండ్రులు చెప్పేది మంచి భవిష్యత్తు కోసంఇటువంటి ఆవేశపు నిర్ణయాలు మంచిది కాదన్నారు. రిషితా ఆత్మకు శాంతి కలగాలన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ, సబ్ కలెక్టర్

# ఘనంగా తొలి ఏకాదశి పూజలు



**గడివేముల మేజర్ న్యూస్ : గడివేముల మేజర్ న్యూస్ :** మండలంలోని బిలకల గూడూరు గ్రామ సమీపానగల జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించబడిన బాలాజీ ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం నాడు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని తొలి ఏకాదశి సందర్భంగా కలియుగ వైకుంఠ వాసుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆగమ శాస్త్ర అర్చకులు గణేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే గడివేములలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మరియు మూల పెద్దమ్మ దేవస్థానం నందు శివాలయంలో మరియు ఆంజనేయ స్వామి దేవాలయం నందు, బూజునూరు గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి లక్ష్మీకాసుల హారం బహూకరణ



అమ్మవారి కాసులపేరును అందజేస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో వెలిసిన శ్రీ కామేశ్వరీ అమ్మవారికి 23 తులాల వెండి కాసుల హారాన్ని బహూకరించారు. ఆదివారం ప్రొద్దుటూరులోని రామేశ్వరం గ్రామానికి చెందిన గంగి వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులు ఆలయ ఏఈఓ మధుకు హారాన్ని అందజేశారు. అలాగే రూ.3500లు విలువ చేసే పట్టుచీరను అమ్మవారికి సమర్పించారు. సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి అలంకరించనున్నారు. అలాగే గోసంరక్షణ నిధికి వినుకొండ మండలం వడ్డెంగుండ గ్రామానికి చెందిన సాన్విక రూ.10,116లు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# ఘనంగా మొహర్రం వేడుకలు



చిగురుమానుపేటలోని చావిడీలో పూజలందుకుంటున్న పీర్లు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పట్టణంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయా కాలనీలలో వెలసిన పీర్లు భక్తుల పూజలందుకుంటున్నాయి. ఆదివారం పెద్ద సరిగెత్తు సందర్భంగా చిగురుమానుపేటలో కొలువైన నైజాం పీర్లు అయిన ఇమాంసామెబ్, ఇమాం కాశీం, లాల్‌స్వామి, ఆలీఅక్బర్, బారిమమ్, మౌలాలిస్వామి పీర్లకు ప్రజలు భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంతోపాటు మండలంలో వివిధ గ్రామాల్లో మొహారం వేడుకలు ఆదివారం ప్రజలు కులమతాలకతీతంగా ప్రశాంతంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు సిఐ రామాంజులుఆధ్వర్యంలో ఎస్.ఐశివాంజులు,మాధవరం ఎస్.ఐవిజయకుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# భగవద్గీత మృత్యుభయాన్ని తొలగించి అమృతత్వాన్ని కలిగిస్తుంది

**ః– భక్తీ శ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం**
**ః– శ్రీనివాస రామానుజ దాసు**



మాట్లాడుతున్న శ్రీనివాస రామానుజ దాసు

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** భగవద్గీత మృత్యుభయాన్ని తొలగించి అమృతత్వాన్ని కలిగిస్తుందని, అలాంటి భగవద్గీతను అందరు పారాయణం చేయడమే కాకుండ అనుష్టానం చేయాలని గుంటూరు జిల్లా నంబూరు కాళీవన ఆశ్రమం పౌరాణిక ప్రవచకులు, హైందవ శ్రేష్ఠ పురస్కార గ్రహీత శ్రీనివాస రామానుజదాసు అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్‌ఆర్ పేటలోని గీతా ప్రచార ధామం నందు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో శ్రీనివాస రామానుజ దాసు ముఖ్యతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజానికి భగవద్గీతను పరిచయం చేసి విస్తృత వ్యాప్తికి కృషి చేసిన వ్యాసాశ్రమం పీఠాధిపతులు పూజ్యశ్రీ మలయాళ సద్గురువు జన్మించిన రోజు కూడా తొలి ఏకాదశేనని అన్నారు. భగవద్గీతకు ఎంత వ్యాప్తి కలిగిస్తే అంత దేశానికి, ప్రపంచానికి హితాన్ని చేకూర్చినటువంటి వారవుతారని వారు ఉద్ఘాటించారు. ముందుగా గోమాతకు పూజలు, శ్రీకృష్ణుడికి అభిషేకం, విశేషాలంకరణ, తదనంతరం సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. గీతా ప్రచార ధామం నిర్వాహకులు, గీతారత్న పురస్కార గ్రహీత డి.వి రమణ మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి సంపూర్ణ భగవద్గీత పారాయణం కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధార్మిక ప్రవచకులు కళ్లే వేణుగోపాలశర్మ, గీతా ప్రచార ధామం సభ్యులు ఇల్లూరి వెంకటరమణ, సింహాద్రి రమేష్, జగన్‌మోహన్, మహాబలేష్, విష్ణు సహస్ర నామ పారాయణ సంఘం అధ్యక్షులు మల్లెల పుల్లారెడ్డి, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం అధ్యక్షులు నాగమల్లేశ్వరమ్మ, నాట్యచారిని దేవిశ్రీ, టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# భక్తీ శ్రద్ధలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్రగా తీర్థ కలశ యాత్ర



పాదయాత్రగా యాగంటికి వెళ్తున్న మహిళలు

**బనగానపల్లె రూరల్ మేజర్‌న్యూస్ :** తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకునిదేశం.పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని బనగానపల్లె మండలంలోని శ్రీహట్టి మునిస్వామి దేవస్థానం నుంచి యాగంటి క్షేత్రానికి పెద్ద ఎత్తున మహిళలు తలపై తీర్థ కలశాలతో ఉంచుకుని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం వరకు తీర్థకలశ పాదయాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం శ్రీ హట్టిముని స్వామి దేవస్థానం నిర్వాహకుడు వి హెచ్ పి సంఘటన కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు, గీతాభజన భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తీర్థకలశ యాత్రలో మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి తలపై తీర్థ కలశాలను ఉంచుకొని హట్టిమునిస్వామి ఆశ్రమం నుంచి 'ఓంనమో భగవతే ఉమామహేశ్వరాయ'అంటూ శివనామాన్ని జపిస్తూ పాదయాత్రగా పట్టణంలోని సుంకులమ్మ దేవాలయం, జుర్రేరు వాగు బ్రిడ్జి,ఆంజనేయస్వామి దేవాలయం, పెట్రోల్ బంక్ కూడలి, యాగంటిపల్లె, సాదుకొట్టాం మాదాసుపల్లె, పాతపాడు గ్రామాల మీదుగా సుమారు 15 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మధ్యాహ్నం యాగంటి క్షేత్రం చేరుకుని చేరుకున్నారు. క్షేత్రంలో గర్భగుడిలో స్వయంభూగా వెలసిన ఆదిదంపతులు విగ్రహనికి తీర్థకళాశాలతో తెచ్చిన జలంతో ప్రత్యేక అభిషేకాలు చేసారు. యాత్ర అనంతరం కలశయాత్రలో పాల్గొన్న భక్తులకు స్థానిక శ్రీ ఉమామహేశ్వర స్వామీ నిత్యాన్నదాన సత్రం ఇతర అన్నదాన సత్రాలు వారు బోజన సదుపాయాలు కల్పించారు.

# 13న హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 13వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆదివారం తొలి ఏకాదశి సందర్బంగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి కర్నూలు జిల్లా కాకుండ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పూజ్య స్వామీజీలు, హిందూధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక సంస్థల ప్రముఖులు నీలి నరసింహ, రామాంజనేయులు, గురుస్వామి, లక్ష్మీరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, సతీష్‌రెడ్డి, మంజునాథ్, చంద్రమోహన్, కౌశిక్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మేడా సుబ్రమణ్యం

# టీడీపీ పార్టీకి మీలాంటి కోవర్టులు అస్సలు అవసరంలేదు..

**ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని విమర్శించేంత స్థాయి మధుబాబు, మల్లికార్జునలకు లేదు**
**ఎక్కడో ఉన్న మధుబాబును కౌన్సిలర్ గా గెలిపించింది ఎమ్మెల్యే బీవీనే**
**గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులతో మిలాఖత్ అయ్యింది మీరు కాదా?**
**ఆనాటి నుండే వీళ్ళకి టీడీపీ పార్టీకి ఎటువంటి సంబంధం లేదు..పట్టణ టీడీపీ నాయకులు**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** 2024 ఎన్నికల సమయంలో వైసీపీ పార్టీతో జతకట్టి తెలుగుదేశం పార్టీలో కోవర్టులు, వెన్నుపోటుదారులుగా వ్యవహరించిన మాజీ కౌన్సిలర్ మధుబాబు, మల్లికార్జునలు టీడీపీ పార్టీకి అస్సలు అవసరం లేదని' టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచానిమహేష్, టీడీపీ నాయకులు దామా నరసింహ, రంగస్వామిగౌడ్, కలీముల్లా, బందే నవాజ్, అంబేద్కర్, విజయలక్ష్మి, వీరేంద్రలు తేల్చి చెప్పారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఇటీవల మాజీ కౌన్సిలర్ మధుబాబు, లక్ష్మీదేవి ఆమె కుమారుడు మల్లికార్జునల



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ నాయకులు

రాజీనామాలపై టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పార్టీకి రాజీనామా చేసిన వ్యక్తులకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదన్నారు. అయితే ఎక్కడో ఉన్న మధుబాబు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దయవల్ల 2014లో ఏకంగా కౌన్సిలర్ గా గెలుపొందాడని తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్యే బీవీ 2021లో రెండోసారి కూడా మధుబాబుకి కౌన్సిలర్ టికెట్ ఇచ్చి గౌరవించిన సంగతిని వారు గుర్తు చేశారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు విస్తృతంగా ప్రచారం చేస్తుంటే మీ ఫోన్లు ఎందుకు స్విచ్ ఆఫ్ లో ఉన్నాయో? సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ రాక్షస పాలన నుంచి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ అహర్నిశలు కష్టపడి సాధించుకున్నారని చెప్పారు. మీ వార్డులో పర్యటించిన సందర్భంలో మీరు మాత్రం అందుబాటులో ఉండరు. పైగా 2022 నుంచి గ్రూప్ రాజకీయాలకు పాల్పడుతూ టీడీపీ పార్టీలో మంచి వాతావరణాన్ని చెడగట్టే ప్రయత్నం చేసింది మీరు కాదా? అని నిలదీశారు. ఎమ్మెల్యే బీవీ గురించి మాట్లాడే స్థాయి మీది కాదన్నారు. టీడీపీ పార్టీకి గాని, ఎమ్మెల్యే బీవీకిగాని కులాలతో సంబంధం లేదన్నారు. బీవీ జయనాగేశ్వర రెడ్డికి అన్ని మతాలు, అన్ని కులాలను సమంగా ఆదరించే మంచి స్వభావం ఉన్న వ్యక్తని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్న నాయకుడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని విమర్శిస్తే సహించే ప్రసక్తేలేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. వైసీపీ పార్టీతో మిలాఖత్ అయ్యింది మీరు కాదా?, పార్టీలోనివ్యవహారాలను లీకులు ఇచ్చింది మీరు కాదా? అని ప్రశ్నించారు. పదిమంది పోతుంటారు.. పార్టీలోకి వందమంది వస్తుంటారు. తెలుగుదేశం పార్టీ ఓ ఫ్యాక్టరీ లాంటిదన్నారు. పార్టీకి ద్రోహం చేసి కుట్రలు కుతంత్రాలకు పాల్పడే వ్యక్తులు ఏ పార్టీలో సరిగ్గా మనుగడ లేరని వారికి చురకలంటించారు. అనంతరం టీడీపీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు మాట్లాడుతూ ఎక్కడో సినిమా థియేటర్లో పనిచేస్తున్న వ్యక్తిని కౌన్సిలర్ గా నిలబెట్టి ఆదరించిన ఎమ్మెల్యే బీవీ గురించి మాట్లాడే అర్హత మీకు ఏమాత్రం లేదన్నారు. ఎమ్మెల్యే బీవీ నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం అమరావతికి వెళ్లే సమయంలో కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పనులు కావడానికి ఇక్కడ ఉండే ప్రముఖ వ్యక్తులకు ఎమ్మెల్యే బీవీ ఆదేశాలతో పని చేస్తావుంటే వారిమీద కూడా బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సూర్య

సోమవారం | 07 జూలై 2025

# కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తుంది

**– ఇది మీది, మాది మంచి ఉమ్మడి ప్రభుత్వం**
**– సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ డా.బైరెడ్డి శబరి**

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ డా.బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం జూపాడుబంగ్లా మండల పరిధిలోని పోతిరెడ్డి పాడు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గ్రామ సర్పంచు పల్లె నిర్మలమ్మ ఆధ్వర్యంలో ఎంపీ డా.బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. ప్రజల్లో విశేష స్పందన వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇది మీది, మాది మంచి ఉమ్మడి ప్రభుత్వం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి అజెండాగా ముందుకెళ్తున్నారని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన తరుణంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం ఉన్నప్పటికి విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధిలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో 80 శాతం నెరవేర్చడం జరిగిందని ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమైందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారిగా ఉండేందుకు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇంటింటికి వస్తున్నామని అన్నారు. ప్రజలు చంద్రబాబు పాలనను ఆశీర్వదిస్తున్నారని అన్నారు. అలాగే 80 బన్నూరు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నందికొట్కూరు మున్సిపల్ చైర్మెన్ సుధాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి డా.కాకరవాడ చిన్నవెంకట స్వామి, దక్షిణ మధ్య రైల్వే జోనల్ మెంబర్ నాగేశ్వర్ రావు, బిఎస్ ఎన్ఎల్ సలహామండలి మెంబర్ రమేష్, టీడీపీ నాయకులు పల్లె శివానంద రెడ్డి, సైపుద్దీన్, రఘురామి రెడ్డి, మురళీ రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు, గోవిందు యాదవ్, రాంబాబు, బాలనారాయణ గౌడు, పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ డా.బైరెడ్డి శబరి

# జిల్లా రిజిస్ట్రార్ .. కాసుల గలగల

(మొదటిపేజి తరువాయి..)

ఉన్నతాధికారి దర్శన భాగ్యం కలుగుతుంది. రూ. కోట్లల్లో జరిగే వ్యాపారాలకు అనుమతులను జిల్లా డిఆర్ కార్యాలయం మంజూరు చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా ఫర్మ్ రిజిస్ట్రేషన్ మొదలుకొని పార్టనర్ షిప్ డిడ్‌తోపాటు సొసైటి డీడ్ తదితర దస్త్రాలు పైసలు ముడితేనే ముందుకు కదులుతున్నాయి. ఇక పబ్లిక్ డేటా ఎంట్రీ దస్త్రాలు నెలల తరబడి కార్యాలయంలో మగ్గిపోతున్నాయి. విదేశీ జిపిఎల అనుమతుల మంజూరు కోసం కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. డిఆర్ జానకిదేవి కార్యాలయంలో తరచు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా కార్యాలయంలో కాసుల వర్షంపై మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

జిల్లా రిజిస్టార్ కార్యాలయంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల దస్త్రాల పర్యవేక్షణతోపాటు ప్రధానమైన పార్టనర్ షిప్, సొసైటి డీడ్‌లతోపాటు ఫర్మ్ రిజిస్ట్రేషన్ల అనుమతులను ఆ కార్యాలయం నుంచే పొందాల్సి ఉంటుంది.డిఆర్‌గాజానకిదేవి విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే దస్త్రాలు ఆయా సీట్లలోనే మగ్గిపోతున్నాయి. రూ. లక్షల్లో చేసే వ్యాపారాలకు ఆ కార్యాలయం నుంచే అనుమతులను పొందాలి. ఇక్కడే వసూళ్ళకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించారు. ఆ మేరకు చెల్లింపులు జరిపితే అనుమతులు మంజూరు అవుతున్నాయి. దస్త్రాల మంజూరుకు నిర్ణయించిన రేటు తగ్గితే ఆ శాఖలోని నియమ నిబంధనలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. కార్యాలయానికి అందించిన దస్త్రాలకు అనుమతి తీసుకొని బయట పడేందుకు యజమానులు కార్యాలయంలోని ప్రతి సీటు నుంచి మరో సీటుకు వెళ్ళేందుకు శ్రమించాల్సి వస్తుంది. ఇక్కడ బేర సారాలకు అవకాశం లేనట్లుగా విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి ఒకరు అన్ని తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు లేకపోలేదు. ఉన్నతాధికారికి దగ్గరగా విధులు నిర్వహిస్తుండంతో ఆ చిరు ఉద్యోగికి కార్యాయలంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎదురు మాట్లాడలేకపోతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇకపోతే పబ్లిక డేటా ఎంట్రీల దస్త్రాలు గతంలో ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతూ వచ్చాయి. ఇప్పుడు ఆ విభాగాన్ని డిఆర్ కార్యాలయానికి బదిలీ చేయడంతో కాసుల వర్షానికి ఆ దస్త్రాలు అదనపు ఆదాయాన్ని సమకురుస్తున్నాయి. 1999లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కంప్యూటర్ వ్యవస్థను తీసుకొని వచ్చారు. 1983 నుంచి ప్రస్తుతం జరిగే రిజిస్ట్రేషన్ల పత్రాలతోపాటు ఇసిలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పొందుతున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల్లోని దిశల్లో దొర్లిన తప్పుల ఎడిట్ ఇన్‌డెక్స్ అనుమతుల మంజూరు డిఆర్ కార్యాలయాల్లోనే పొందాల్సి ఉంటుంది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి డిఆర్ కార్యాలయాలకు చేరిన దస్త్రా లు అక్కడి నుంచి మంజూరు కావాలంటే నెలల తరబడి వేచి ఉండా ల్సి వస్తుంది. కార్యాలయ ముఖ్య ఉన్నతాధికారి కార్యాలయంలో సరిగ్గా అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు బలంగా వినిపి స్తున్నాయి. ఏది ఏమైనా డిఆర్ కార్యాలయం నుంచి దస్త్రాల అనుమ తులకు నిర్ణయించిన ధరను చెల్లించడమే ఒకే మార్గంగా కనిపిస్తుం ది. డిఆర్ కార్యాలయంలో అనుమతుల అక్రమ వసూళ్ళపై మేజర్ న్యూస్ ప్రతినిధి డిఆర్ జానకిదేవిని వివరణ కోరేందుకు సెల్‌ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

# 10న మెగా పేరెంట్స్ సమావేశం

(మొదటిపేజి తరువాయి..)

ఆదివారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం నందు మెగా పిటిఎం 2.0కు సంబంధించి నియోజకవర్గ, మండల స్పెషల్ అధికారులు, ఎంపిడిఓలు, ఎంఈఓలతో కలిసి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించుకున్న మెగా పిటిఎం విజయవంతంగా నిర్వహించామని అదేస్ఫూర్తితో ఈ నెల 10న నిర్వహించనున్న కార్యక్రమాన్ని కూడా కలిసికట్టుగా ఎలాంటి ఆటంకాలు లేకుండ అధికారులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులతో పాటు పూర్వ విద్యార్థులను సైతం ఆహ్వానించేలా సంబంధిత ఎంఈఓలు, స్పెషల్ అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మిడ్‌డే మీల్స్‌కు సంబంధించి జోన్4కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన మెనూను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ డిఎస్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో ప్రతి విద్యార్థి తమ తల్లి పేరుతో మొక్కలు నాటేలా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. అందుకోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు. మండల అధికారులు మొక్కల కోసం డిఎఫ్ఓ, డ్వామా పిడిలతో సమన్వయం చేసుకుని మొక్కలను రవాణా చేయించుకోవాలన్నారు. మెగా పిటిఎంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు విద్యా శాఖ అధికారులు జిల్లా స్థాయి, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**అర్హులైన వారందరికి ప్రత్యేక జాబితాను సిద్ధం చేయండి :** తల్లికి వందనం పథకం ఏ విద్యార్థికైనా అందనిపక్షంలో ఉంటే వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు స్క్రూటినీ చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం పథకం ఏ విద్యార్థికి ఏ కారణం చేత లబ్ది చేకూరలేదో ఆ జాబితాలను కూడా సంబంధిత అధికారులు సిద్ధం చేసుకుని ఉండాలన్నారు. చాలాచోట్ల జాయింట్ ఎల్‌పిఎం సమస్య వల్ల తల్లికి వందనం లబ్ది చేకూరనట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఆ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య, అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, డిఈఓ శామ్యూల్‌పాల్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో భక్తి శ్రద్ధతతో ముగిసిన మొహర్రం

(మొదటిపేజి తరువాయి..)


మాతం నిర్వహిస్తున్న దృశ్యం

జూన్ 27 న ప్రారంభమైన ముహర్రం వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు నవాబు కోటలో మల్లిస్ ప్రార్థనల అనంతరం స్థానిక దొర కోటనుంచి ప్రారంభమైన ఆలంల (పీర్ల) ఊరేగింపు పోస్టాఫీసు, ఆస్థానం, సర్కిల్ కార్యాలయం, పాతబస్టాండ్ మీదుగా బయలుదేరి జుర్రేగట్టున పీర్లను నీళ్లు చల్లి దట్టీలను ఒక ప్రత్యేక పేటికలో ఉంచటంతో ముగిసింది. స్థానిక నవాబు కోటనుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపులో షియా తెగకు చెందిన ముస్లింలు ఆలంల ఊరేగింపులో శోకగీతాలు అలపిస్తూ, ఎదపై చురకత్తులతో రక్తం చిందేలా కొట్టుకుంటూ మాతం ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో నవాబు వంశీకులు నవాబ్ మీర్ ఫజల్ ఆలీఖాన్ ఆయన కుమారుడు మీర్ గులాం అలీఖాన్ వారి కుటుంబీకులు మాతం చేసుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. సాయంత్రం మొహారం వేడుకల్లో కొండపేట పెద్ద పీర్ల చావిడిలో 10 రోజులుగా పూజలందుకున్న హసన్, హుస్సేన్ పిర్లను, బీబీ ఫాతిమా పీర్లను జుర్రేరు గట్టున నిమజ్జనం చేసి దట్టీలపై నీళ్లు చల్లి ఒక పేటికలో భద్రపరచటంతో ఆఖరి ఘట్టమైన షహదత్ వేడుకలు ముగిసాయి. ముహర్రం సంతాప సూచకంగా పట్టణంలో సినిమా హాళ్ళు బంద్ చేశారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం బనగానపల్లెలో ముహర్రం వేడుకలకు రూ.10 లక్షల నిధులు కేటాయించడమే కాకుండా, నవాబు వంశీకుల ఆధీనంలో ఉన్న ఆస్థానంలో ప్రారంభమైన అలంల కూచోబెట్టే ప్రారంభ వేడుకలు రాష్ట్ర ఆర్ అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అధికార లాంఛనాలతో ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా హైదరాబాద్ తర్వాత అంతే ఘనంగా మాతం జరుపుకుంటు జరిగే ఈ వేడుకల్ని చూసేందుకు పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. సాయంత్రం మొహారం వేడుకల్లో కొండపేట పెద్ద పీర్ల చావిడిలో 10 రోజులుగా పూజలందుకున్న హసన్, హుస్సేన్ పిర్లను, బీబీ ఫాతిమా పిర్లను జుర్రేరు గట్టున నిమజ్జనం చేసి దట్టీలపై నీళ్లు చల్లి ఒక పేటికలో భద్రపరచటంతో ఆఖరి ఘట్టమైన షహదత్ వేడుకలు ముగిసాయి.

**మాతం ఊరేగింపులో అంబులెన్స్ సౌకర్యం :** మాతం ఊరేగింపులోపాల్గొన్నవారికి ఆరోగ్యపంమైన ఇబ్బందులు కలిగితే సత్వర చికిత్స అందించేందుకు ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశాల మేరకు మాతం ఊరేగింపు దారిలో రెండుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే అత్యవసర చికిత్స అవసరమైతే వారిని తరలించేం దుకు అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించారు.

**భారీ పోలీస్ బందోబస్తు :** మొహారం షహదత్ ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా డోన్ డిఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బనగానపల్లె అర్బన్, రూరల్ సిఐలు ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి, నంద్యాల సిఐ ప్రభాకర రెడ్డిల పర్యవేక్షణలో బనగానపల్లె, అవుకు,నందివర్గం ఎస్సైలు దుగ్గిరెడ్డి, రాజారెడ్డి, వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# సమానత్వం కోసం పోరాడిన యోధుడు బాబు జగ్జీవన్‌రామ్

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం చేసిన యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అనినంద్యాల డి సి సి అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు.ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పాణ్యం నియోజకవర్గం నంద్యాల చెక్ పోస్ట్ లోని దామోదరం సంజీవయ్య భవనంలో నంద్యాల పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి 16వ వార్డుల ఇన్చార్జి రజాక్ వలి అధ్యక్షతన బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసీసీ సభ్యులు లక్ష్మి నరసింహ యాదవ్ హాజరై చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ భారత రాజకీయాల్లో ఒక ముఖ్యమైన వారని, సామాజిక న్యాయం కోసం మరియు సమానత్వం కోసం చేసిన పోరాట యోధుడని కొనియాడారు అదే విధంగా దేశానికి ఉప ప్రధానిగా ఎన్నో సేవలు అందించాలని అతని మహాత్మా గాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 1935లో అంటరాని వారి సమానత్వం కోసం అంకితమైన ఆల్–ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ స్థాపించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కార్మికుల కోసం ఉద్యోగుల కోసం నిరంతరం పోరాటం చేసే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినటువంటి మహోన్నత వ్యక్తి బాబు జగజీవన్ రామ్ అని కొనియాడారు.అసంఘటిత కార్మికుల నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు పటాన్ అభి ఖాన్ నంద్యాల పార్లమెంట్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు జీవన్ బాబు జిల్లా కార్యదర్శి వెంకట నాయుడు పాణ్యం నియోజకవర్గం మండల అధ్యక్షులు మోషన్ బేగ్ .అలీ ఖాన్ షేక్ మాసం నాగార్జున పాల్గొన్నారు.



## కుక్క కాటు వల్ల వచ్చే రేబిస్ వ్యాధి ప్రమాదకరం




మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** కుక్క కాటు వల్ల వచ్చే రాబిస్ వ్యాధి ప్రమాదకరమని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు స్థానిక పశు వైద్యశాలలో యాంటీ రాబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారన్నారు పెంపుడు జంతువుల యజమానులు జంతువులను పెంచేటప్పుడు వ్యాధులు రాకుండా జాగ్రత్త వహిస్తూ తప్పనిసరిగా రెండు మూడు నెలలకు ఒకసారి వెటర్నరీ హాస్పిటల్ నందు వైద్యులను సంప్రదించి సూచనలు సలహాలు పాటిస్తే పెంపుడు జంతువుల నుంచి వచ్చే రాబిస్ మరియు జునోసిస్ వ్యాధులను అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్, ఎస్పిసిఎ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు ఈపనగండ్ల శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 8న పత్తికొండలో వైసిపి నియోజకవర్గ విస్తృత సమావేశం

**తుగ్గలి, మేజర్ న్యూస్ :**పత్తికొండ పట్టణంలోని గోపాల్ ప్లాజాలో జూలై8వతేదీ మంగళవారం ఉదయం 10.00గంటలకు వైఎస్ఆర్సిపి నియోజకవర్గ విస్తృత సమావేశం మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ అధ్యక్షతన జరుగుతున్నట్లు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, మండల వైసీపీ కన్వీనర్ల గోపాల్ రెడ్డిలు తెలిపారు. ఈ సమావేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి, కర్నూల్ పార్లమెంటు అబ్జర్వర్ గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున మండలములోనే వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** స్వతంత్ర సమరయోధుడు భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని జై భీమ్ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కి జానయ్య మాదిగ పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు జైభీమ్ ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో మంత్రాలయం మండల కేంద్రంగా ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం బస్టాండు సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైభీమ్ ఎమ్మార్పిఎస్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు జానయ్య మాదిగ, జిల్లా నాయకులు హనుమన్న, రత్నంలు మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తన చిన్నతనంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి ఎన్నో ఉద్యమాలు చేశారని కొనియాడారు. భారతదేశ వ్యాప్తంగా కార్మిక చట్టం కంచి తపాల రోడ్డు రవాణా శాఖ పౌరసరఫరాల శాఖ వీటికోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్ మేజర్‌న్యూస్ :** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు నంద్యాల వాస్తవ్యులు ఎం. రితేష్ రెడ్డి ( నవోదయ కాంట్రాక్టర్ ) వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,000/-రూచందాను డెవలప్‌మెంట్‌కమిటీచైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు. దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

**:- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రౌడీసీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేర చరిత్ర గలవారికి చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించా లని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తప్పనిస రిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు.

## జేశాప్ ఆళ్లగడ్డ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా హుస్సేన్ బాషా ఎన్నిక




**ఆళ్లగడ్డ మేజర్‌న్యూస్ :**జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్‌ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) ఆళ్లగడ్డ నియోజవర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. ఆదివారం ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ 6టీవీ పంబ శ్యాం కుమార్ అధ్యక్షతన కెవి సుబ్బారెడ్డి జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు బి మోహన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ ఆరోగ్యమే పరమావధిక జె షాప్ స్థాపించడం జరిగిందన్నారు. పాత్రికేయులు నిత్యం వార్తలు సేకరణలో భాగంగా ఒత్తిడి గురవుతు న్నారు. ఈ మేరకు మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు పాత్రికేయులు కూడా క్రీడలను పాలు పంచుకోవాలని ఆయన సూచించారు . జేశాప్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా ఎన్టీవీ రిపోర్టర్ హుస్సేన్ భాషను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా అరుణ్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, సహాయ కార్యదర్శిగా రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దిలేటి , తదితరులతో కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరంగౌరవ అధ్యక్షుడితోపాటు కమిటీ సభ్యులందరినీ ముఖ్య అతిథులు దుశ్యాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.

## విద్యతో ఏదైనా సాధించవచ్చు

**:- కన్స్యూమర్ కోర్టు జడ్జి కిషోర్ కుమార్**



మాట్లాడుతున్న వక్తలు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** విద్యతో ఏదైనా సాధించవచ్చని కన్స్యూమర్ కోర్టు జడ్జి కె కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం సంకల్‌బాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి, కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం వారి ఆద్వర్యంలో పది, ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, రూ.4వేలు పైకం అందచేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కన్స్యూమర్ కోర్టు జడ్జి కె కిషోర్ కుమార్ హాజరై జ్ఞాపికలు, నగదును అందచేశారు. అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ సౌజన్యంతో బ్రాహ్మణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉపవాసం ఉన్నవారికి పలహారం ఏర్పాటు చేశారు. కె రంగనాథ శర్మ ఇలాంటి మంచి కార్యక్రమాలకు తోడ్పడటం కోసం తనవంతు సహకారం రూ.10వేలు అందచేశారు. కెవి సుబ్బారావు మంచి పనులకు మా సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అలాగే సండేల్, దుర్గా ప్రసాద్ భారీగా ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు చెరువు దుర్గా ప్రసాద్, కార్యదర్శి చల్లా నాగరాజు శర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యాం సుందర్ రావు, కోశాధికారి సిఎస్ ప్రసాద్‌రావు, ఉప కార్యదర్శి నాగుల వరం రాజశేఖర్‌రావు, సలహాదారు టివి రవిచంద్ర శర్మ, శ్రీనివాసరాజు, బి నాగేశ్వరరావు, మామిల్లపల్లి రాజేష్, పాల్గొన్నారు.

## నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– భక్తులెవరు నదీలో స్నానాలు ఆచరించొద్దు – సిఐ**



నదీతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిఐ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** తుంగభద్రనదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సిఐ రామాంజులు పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రాలయం సమీపాన ఉన్న తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాలను సిఐ పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రంలో భారీగా వర్షాలు కురవడం వలన హోస్పేట్ డ్యామ్ భారీగా వరద నీరు చేరడంతో 21గేట్లు ఎత్తి వేశారు. దీంతో మంత్రాలయం సమీపాన తుంగభద్రనదీ ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. భక్తులెవరు కూడ స్నానాలు ఆచరించడానికి నదీలోకి వెళ్లరాదని హెచ్చరించారు. తుంగభద్రనదీలోకి ఎవరు వెళ్లకుండా పోలీస్ సిబ్బందిని, అలాగే రాఘవేంద్ర స్వామి మఠం సిబ్బంది నదీ స్నానాల కోసం వెళ్లొద్దని బారీ కేడ్లను ఏర్పాటు చేశారు.

## ముస్లిం సోదరులకు తేనీటి పానీయం పంపిణీ చేసిన బీసీ ఇందిరమ్మ



**బనగానపల్లె రూరల్ మేజర్‌న్యూస్ :** కర్బలాలో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన వారికి సంతాప సూచికంగా బనగానపల్లి పట్టణంలో ఆదివారం నాడు భక్తిశ్రద్ధలతో మొహరం కార్యక్రమానికి ముగింపు పలికారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపుగా ప్రధాన అర్వదారులకుండా వెళ్లడం జరిగింది వీరికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ తేనీటి పానీయాన్ని (షర్బత్) అందజేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

## ఓటమి ఎరుగని నాయకుడు బాబు జగ్జీవన్ రామ్

**:- మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** సామన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన ఓటమి ఎరుగని నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని మాజీ ఎమ్మెల్సీ, మాజీ డిసిసి అధ్యక్షులు, ఏఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఐదురోడ్ల కూడలి నందు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ బీహార్ రాష్ట్రం చాంద్వా జిల్లాలో జన్మించారని ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత పార్లమెంట్‌లో సుమారు 40ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్నారు. చట్టసభలకు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై సంచలనం సృష్టించారని కొనియాడారు. పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రామకృష్ణ, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ ఎన్‌సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు బి సుబ్రమణ్యం, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com



# మహానంది క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు

**–భక్తి శ్రద్ధలతో ఆలయ శుద్ధి**



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో తొలి ఏకాదశి పర్వదినం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం భట్‌ల వేదమంత్రాలతోఆలయ ప్రధానఅర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఏఈఓ మధులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహించారు. మూలవిరాట్‌లైన శ్రీ కామేశ్వరీ సమేత



తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు. ఫలహారాలతో మహానివేదన సమర్పించారు.

**ఆలయ శుద్ధి :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వేద పండితుల వేద మంత్రాలతో గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక మూలికలతో ఆలయంలోని మూలవిరాట్‌లకు వేద మంత్రాలతో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయమంతటా, గోపురాలను, ధ్వజస్తంభాన్ని నీటితో శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, సుబ్బా రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి బీసీ

**గాయపడిన వ్యక్తిని కాన్వాయ్‌లో ఆసుపత్రికి తరలింపు..!**



గాయపడిన వ్యక్తిని కారులో తరలిస్తున్న మంత్రి బిసి

**బనగానపల్లె మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి మరో సారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈరోజు ఉదయం బనగానపల్లె నుండి కర్నూల్ వైపు ఓ కార్యక్రమం నిమిత్తం వెళ్తున్న క్రమంలో, పాణ్యం – కర్నూల్ జాతీయ రహదారిపై ఓర్వకల్లు సమీపాన యాక్సిడెంట్ లో గాయపడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని మంత్రి గమనించారు. వెంటనే కాన్వాయ్‌ను ఆపిన మంత్రి ఘటనా స్థలానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి పరిస్థితిని గమనించి వెంటనే తనకాన్వాయ్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు ఫోన్ చేసి, బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి మానవత్వంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తుల రద్దీతో కళకళలాడిన మల్లన్న క్షేత్రం



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల క్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది.రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం తరలివచ్చి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.ముందుగా పాతాళగంగలో పుణ్య స్నానాల అనంతరం దర్శనార్థమై ఆలయ క్యూలైన్లో బారులు తీరారు.ఆలయ ఉచిత,శీఘ్ర,అతి శీఘ్ర క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి.భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

# సిఎం చంద్రబాబు నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యం

**ః– అశోక్‌నగర్‌లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్**

**ః– ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరించిన మంత్రి**



సంక్షేమ పథకాల కరపత్రాలు అందచేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లాంటి విజనరీ నాయకత్వంలోనే రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు వెళుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 45వ వార్డు అశోక్ నగర్‌లో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం మంత్రి టీజి భరత్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సిఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో చాలామంది పింఛన్లు కట్ చేశారని ఈ విషయాన్ని ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్నట్లు చెప్పారు. సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న మంచి పనుల వల్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి అన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలందరు మెచ్చుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ పార్టీ నాయకులమందరం భాగస్వాములై ఇంటింటికి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు చెప్పిన సమస్యలను నోట్ చేసుకుని వెంటనే వీటి పరిష్కారం కోసం తాము అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాణిక్యమ్మ, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, బూత్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# బానకచెర్ల రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదల

**నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు రైతులు సకాలంలో పంటలు వేసుకోవాలి..ఎమ్మెల్యే బుడ్డా**

**పాములపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బానకచర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుండి ఆదివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య దిగువకు నీటిని విడుదల చేశారు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడి గట్టు ప్రధాన కాల్వ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు 20,000 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అక్కడి నుంచి తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు 10,000 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 6,740 క్యూసెక్కుల నీటి దిగువకు వదిలారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సకాలంలో పంటలు వేసుకోవాలని వర్షాలు అధికంగా పడుతున్నాయని సమయం కానీ సమయంలో వేసుకోవడం వల్ల నష్టపోతున్నారని ఎప్పుడు పడితే అప్పుడు నీళ్లు ఎలా వస్తాయని దేవుడు దయవల్ల గత ఏడాదికి ఏడాదికి 20 రోజులు ముందుగానే కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోందని త్వరలోనే శ్రీశైలం డ్యాం నుండి నీటిని విడుదల చేస్తామని చెప్పారు గత ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులకు కేవలం మోటర్లు రిపేరింగ్ కూడా చేయలేని వాళ్లు ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఏం చేశారు అంటూ ప్రెస్ మీట్ లు పెడుతున్నారని అంటున్నారని ఒకసారి వచ్చి చూస్తే అర్థమవుతుందని ఊరికే రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటే సరిపోదని ఎదవ చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య మాట్లాడుతూ ప్రతి చెరువును, కుంటను నింపాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన మేరకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో కొంత మేర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులందరికీ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి టిడిపి నాయకులు హరినాథ్ రెడ్డి, గడగారి రామలింగేశ్వర్ రెడ్డి,పల్చని మహేశ్వర్ రెడ్డి,రాయపాటి గోవిందు ఇరిగేషన్,అధికారులు నాయకులు రైతులు పాల్గొన్నారు.





బానకచర్ల రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు, బానకచర్ల రెగ్యులేటర్ వద్ద రైతులు నాయకులు

# అహోబిలేశునికి నవ కలశ పంచామృతాభిషేకం

**రత్నాంగి కవచం లో ప్రత్యేక దర్శనం ఇచ్చిన అహోబిలేశుడు**





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జైష్ఠాభిషేక తిరుమంజనం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఉత్సవమూర్తులైన శ్రీ భూ నీలా సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామికి నవ కలశ పంచామృతాభిషేకం (తిరుమంజనం)చూడముచ్చటగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానార్చ కులు వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ వైష్ణవ పుణ్య క్షేత్రమైన అహోబిల క్షేత్రాల్లో జేష్ఠ మాసంలో భాగంగా రెండవ రోజు జేష్ఠభిషేకం లో శ్రీ భూమి నీలా సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామికి నవ కలశ పంచామృతాభిషేకం నిర్వహించామన్నారు. సాయంత్రం స్వామి వారు తొలి ఏకాదశి సందర్భంగా భక్తులకు రత్నాంగికవచంలో దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ మాడ వీధులగుండా గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

నగరంలోని పలు దేవాలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా సంకల్ బాగ్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అలాగే చిత్తారి వీధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, పూలబజార్‌లోని చిన్నమ్మ వారి శాల ఆలయంలో, పెద్దమ్మ ఆలయంలో, కల్లూరు ప్రాంతంలో ఉన్న అమ్మవారి శాఖ ఆలయంలో, సుంకేశ్వరి రోడ్డులో గల గోదా గోకులం ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తొలి ఏకాదశి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో వెలసిన దేవతామూర్తులను ప్రత్యేక పూలమాలతో తులసి దళాలతో అలంకరించారు. నీష్టతో పూజలు నిర్వహించి మంగళారతులు ఇచ్చారు. స్వామి వారికి ఆలయ పూజారులు, పురోహితులు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు.